

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## నవ్వు మొహం రాఘవరావు

"**అమ్మాయ్.** హోమ్ వర్క్ చేసావా?" రాఘవరావు నవ్వుతూ అడిగాడు.

"చేశా. నువ్వు చేయలేదా?" అడిగాను.

"ఈ మేక్స్ చాలా కష్టం అమ్మాయ్" రాఘవ తల గోక్కుంటూ చెప్పాడు.

"మేక్స్ కాదు. మేథ్స్" సరిదిద్దాను.

"సరేలా కానీ నీ నోట్స్ ఇస్తావా? కాపీ  కొట్టుకుని ఇస్తాను. అదేంటి నీ మెడమీద గ్రంథమా?" అడిగాడు.

నేను పకపక నవ్వి, 'గ్రంథం కాదు. గంధం ' అన్నాను.

"మీ అంత స్వచ్చితంగా మాట్లాడటం మాకు రాదులే అమ్మాయ్" రాఘవరావు ఉడుక్కున్నాడు.

"స్వచ్చితం కాదు స్వచ్ఛం" చెప్పాను.

"ఏదో ఒకట్లే. నీకు అర్థమైందిగా, నాది బండ నాలిక. మీరంటే మేకల్లాగా ఆకుకూరలు తింటారు. అందుకని  మీది పల్చటి నాలిక" కిచకిచ నవ్వాడు.

"మేకలు కూడా స్వచ్ఛంగా మాట్లాడతాయా?" కోపంగా అడిగాను.

"ముందు పుస్తకం ఇస్తావా? బెల్లు కొడతారు మళ్ళీ."

నేను నా ఐదో తరగతి మేథ్స్ హోమ్ వర్క్ పుస్తకాన్ని అతని చేతిలో పెట్టాను. పావుగంటలో దాన్ని కాపీ కొట్టి తిరిగిస్తూ నవ్వుతూ చెప్పాడు.

"రెండు స్టెప్పులు ఎగరకొట్టా. లేకపోతే మాస్టారు నేను కాపీ కొట్టాను అనుకుంటారు."

"అబ్బో! చాలా తెలివే" నవ్వాను.

రాఘవరావు ఒకటో తరగతి నించి నా క్లాస్మేట్. శుద్ధ మొద్దు. మా తెలుగు మాస్టారు ఎప్పుడూ 'నీకు పొట్టకోస్తే అక్షరం ముక్కలేదురా' అని తిట్టేవారు. రాఘవ మొహంలో  బాధ అవమానం కనిపించేవి కాదు. నవ్వుతూ పొగడ్తలని విన్నట్లుగా ఆ తిట్లని వినేవాడు. ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడని అతనికి మేము 'నవ్వుమొహం రాఘవరావు' అని పేరు పెట్టాం. ఆ వయసులో నాకు స్థిత ప్రజ్ఞుడు అనే మాట తెలీదు కానీ, అది రాఘవకి సరిగ్గా సరిపోతుంది. ఆధ్యాత్మికతలో చెప్పిన ఆనందం కూడా.

ఆ మధ్యాహ్నం రాఘవరావు ఓ బాదం ఆకు మీద చెయ్యి అడ్డుపెట్టి తీసుకొచ్చి నాకు ఇచ్చాడు. చూస్తే పచ్చ రంగు పదార్ధం కనిపించింది.

"ఇదేంటి?" అడిగాను.

"మాకు మధ్యాహ్నం ఉప్మా పెడతారు కదా? నీకు రుచి చూపిద్దామని తెచ్చాను" నవ్వాడు.

"మరి నీకు?" దాన్ని అందుకుంటూ అడిగాను.

"ఏం పర్లా" చప్పరించాడు.

నేను ఆ ఉప్మాని కొంచెం తీసుకుని తిని, ఆకు తిరిగి ఇచ్చేస్తూ చెప్పాను.

"భలే ఉంది."

"అవును. మరి హెడ్ మాస్టర్‌గారింటికి కూడా పంపించాలి కదా! అందుకని ఆయమ్మ జాగ్రత్తగా చేస్తుంది" గొంతు తగ్గించి చెప్పాడు.

"అదేంటి హెడ్ మాస్టర్‌గారు ఓ సి కదా?  అది కాక అది పిల్లలకే. ఆయన మీ ఉప్మా తినటం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆయనేకాదు. వాళ్ళ ఇంట్లో అందరూ. ఆయమ్మ రోజూ ఫ్యాన్‌తో పెద్ద కేరేజ్ పంపిస్తుంది."

"ఛ. మరి రోజూ ప్రేయర్‌లో నీతులు చెప్తాడే?" నాకు కోపం వచ్చింది.

రాఘవ గలగల నవ్వి చెప్పాడు.

"అది మా మంచికేలే. లేకపోతే ఇంత బాగుండేది కాదు."

"ఆ మాట నిజమేలే" ఒప్పుకున్నాను.

రాఘవది బిసి కేటగిరీ. వాళ్ళ నాన్న ఓ పెద్ద రైతు దగ్గర పెద్ద పాలేరుగా పనిచేస్తాడు. వాళ్ళ అమ్మ, నాయనమ్మ కుండలు చేస్తారు. రాఘవ అన్నయ్య బాగా తెలివైనవాడు. అతను బిఎస్సీ చదువుతున్నాడు. పాపం రాఘవకి ఆ తెలివితేటల్లో ఒక్క పర్సెంట్ కూడా రాలేదు.

హోం వర్క్ సరిగ్గా చేయలేదని మాస్టారు బెత్తంతో కొడుతుంటే వాడు నవ్వుకుంటూ ఒళ్ళప్పగించాడు. అది మాస్టారికి ఇంకా కోపం తెప్పించి నాలుగు దెబ్బలు ఎక్కువే వేసారు.

ఆరో తరగతికి రాఘవరావు స్కూల్ మారిపోయాడు. మా అప్పర్ ప్రైమరీ స్కూల్ నించి, వాళ్ళ అన్నయ్య వాడిని గుంటూరులోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో చేర్పించాడు. దసరా సెలవులకి వచ్చిన రాఘవరావు ఓ రోజు మా ఇంటికి వచ్చాడు.

"ఇదేంటి? ఇంత సన్నగా అయిపోయావు?" ఆశ్చర్యంగా అడిగాను.

"అక్కడ హెడ్మాస్టర్‌కి, వార్డెన్‌కి కేరేజీలు వెళ్ళవు. అందుకని పురుగుల అన్నం పెడుతున్నారు" నవ్వుతూ చెప్పాడు.

"అయ్యో! మరి ఎవరికైనా కంప్లైంట్ చేయచ్చుగా?" అడిగాను.

"ఎవరికి?" వింతగా చూస్తూ అడిగాడు.

"ఎవరికైనా."

"రోజుకి పదిసార్లు మాకు ఫ్రీగా తిండి పెడుతున్నామని చెప్తుంటారు. ఫ్రీ తిండికి కంప్లైంట్ కూడానా మళ్ళీ?" నవ్వాడు.

నాకు బాధేసింది.

"అక్కడెందుకు? మన స్కూల్లోనే ఉండొచ్చుగా? మీకెటూ ఫీజుల్లేవుగా?" అడిగాను.

"ఒక మనిషి తిండైనా తగ్గుతుందిగా."

“మేము ధనవంతులం కాదు. కానీ తిండి ఖర్చు తగ్గుతుందని పురుగుల అన్నం పెట్టే హాస్టల్లో చేర్పించారు” అన్నమాట నాకు హృదయ విదారకంగా అనిపించింది.

"నీకోటి తెలుసా?" రాఘవరావు నవ్వుతూ అడిగాడు.

"ఏమిటి?"

"అన్నాలు పెట్టేటప్పుడు లైట్లు ఆపేస్తారు. కొవ్వొత్తి వెలుగులో తినాలి. అప్పుడు పురుగులు కనిపించవు కదా. కానీ చారన్నంలో తేలుతుంటాయి."

"ఇంక చెప్పద్దు. కనీసం పాఠాలైన బాగా చెప్తారా?" అడిగాను.

చప్పరించాడు.

"వాళ్ళ తప్పు కాదులే. నాదే మొద్దు బుర్ర."

సెలవలన్నాళ్ళు రాఘవరావు రోజూ సాయంత్రం మా ఇంటికి వచ్చేవాడు. పగటిపూట వాళ్ళ నాన్నకి సాయంగా పొలం పనులకు వెళుతున్నానని చెప్పాడు.

సెలవులు అయిపోగానే మళ్ళీ గుంటూరు వెళ్ళిపోయాడు.

ఇంటర్మీడియట్‌కి రాఘవరావుని వాళ్ళ అన్నయ్య తనతో వైజాగ్ తీసుకెళ్ళాడు. అక్కడ అతను కెమిస్ట్రీలో డాక్టరేట్ చేస్తున్నాడు.

"వైజాగ్ ఎలా ఉంది?" ఒకసారి వచ్చినప్పుడు అడిగాను.

"బాగుంది. కానీ మార్కులే రావట్లేదు. మా అన్నయ్య ఒకటే తిట్లు" నవ్వాడు.

"మరి చదవచ్చుగా?"

"వందసార్లు చదివినా రాదు. ఫిజిక్స్ మరీ కష్టంగా ఊంది."

"మరి సీయీసీ తీసుకోవాల్సింది."

"మా అన్న ఎంపిసీలో చేర్పించాడు."

"నేను చదవలేను అని చెప్పాల్సింది. నేను కూడా సీయీసీలోనే చేరాను. మేథ్స్ అంటే భయం. సైన్స్ ఫర్వాలేదు. డిసెక్షన్స్ చేయాలని బైపిసి తీసుకోలేదు" చెప్పాను.

"మా అన్న వినలేదు. మనకి గవర్నమెంట్ ఇన్ని అవకాశాలు ఇస్తుంటే ఎందుకు అందిపుచ్చుకోవు? అని తిడుతున్నాడు కాకపోతే అక్కడ భోజనం బాగానే ఉంది."

"పోన్లే కనీసం అదైనా బాగుంది" చెప్పాను.

రాఘవరావు ఇంటర్ గ్రేస్ మార్క్సుతో పాసయ్యాడు. వాళ్ళ అన్నయ్య పిహెచ్‌డి ఇంకా పూర్తికాలేదు. అక్కడే బిఎస్సీలో చేర్పించాడు. నేను బికాంలో చేరాను. అప్పుడప్పుడు రాఘవరావు వాళ్ళ అమ్మ కనిపిస్తుండేది.

రాఘవరావు అన్నయ్య పెళ్ళికి వచ్చినప్పుడు నన్ను కలిసాడు.

"బిఎస్సీలో ఎందుకు చేరావు? బి.ఏనో బీకామో చేయాల్సింది. మీ అన్నయ్యకి ధైర్యంగా చెప్పచ్చుగా?" మందలింపుగా అడిగాను.

"మా వదిన వస్తుందిగా. ఇంక మా అన్నయ్యకి నామీద శ్రద్ధ తగ్గుతుందేమో చూద్దాం. అప్పుడు బిఏలో చేరతాను" నవ్వాడు.

కానీ రాఘవరావు వదిన గవర్నమెంట్ నర్స్. తిరుపతిలో పనిచేస్తుంది. ఆమెకి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయ్యేదాకా అక్కడే ఉంటుంది. దాంతో రాఘవరావు కన్సెషన్ మార్కులతో బిఎస్సీ గట్టెక్కాడు.

సెలవుల్లో వాళ్ళ నాన్నతో కలిసి వ్యవసాయం చేసేవాడు. సాయంత్రాలు అప్పుడప్పుడు మా ఇంటికి వచ్చి కూర్చునేవాడు.

"ఫ్రిజ్‌లు వచ్చాక మా కుండలకి గిరాకీ లేదు. పెళ్ళిళ్ళప్పుడు మాత్రమే భజంత్రీలతో వచ్చి తీసుకెళ్తారు" నవ్వేవాడు.

ఆ వేసవిలో నా పెళ్ళయి హైదరాబాద్ వచ్చేసాను. శ్రావణ మాసంలో ఇంటికి వెళ్ళినప్పుడు  రాఘవరావు ఎమెస్సీలో చేరాడని తెలిసింది.

"వాళ్ళకి అన్ని రిజర్వేషన్స్. నాకు సిక్స్టీ పర్సెంట్ వచ్చినా పిజి సెంటర్‌లో కూడా సీట్ రాలేదు. వాడికి థర్టీ సెవెన్ పర్సంట్‌కి ఏ యు లో ఫిజిక్స్‌లో సీట్ వచ్చింది" నా ఫ్రెండ్ ఉక్రోషంగా  చెప్పింది.

"ఫిజిక్స్‌లోనా?" ఆశ్చర్యపోయాను.

పాపం ఎలా చదువుతాడో అని జాలేసింది.

రెండేళ్ళ తర్వాత ఒకరోజు అమ్మ ఫోన్ చేసి చెప్పింది.

"మీ నవ్వు మొహం రాఘవరావు పెళ్ళిట. చెప్పి వెళ్ళాడు. అమ్మాయి ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌ట."

"ఓ! మరి రాఘవ ఏమి చేస్తున్నాడు?" అడిగాను.

"ఏదో ప్రైవేట్ స్కూల్‌లో పని చేస్తున్నాడట."

"పోనీలే. చిన్నప్పటినించి చాలా కష్టపడ్డాడు" చెప్పాను.

ఆ తర్వాత ఆరు నెలలకి నేను మా ఊరు వెళ్ళినప్పుడు రాఘవ కనిపించాడు. ధోవతి కట్టుకుని బనీన్ వేసుకున్నాడు. పొడుగాటి కర్రని మెడమీద అడ్డంగా పట్టుకున్నాడు.

"ఈ అవతారం ఏమిటి?" ఆశ్చర్యపోయాను.

"రైతు కూలి అవతారం" నవ్వాడు.

"అంత చదువుకుని ఈ పనేంటి?" మందలింపుగా అదిగాను.

"జాబ్ రాలేదమ్మాయ్. ఆ స్కూల్‌లో వెయ్యి రూపాయలకి సంతకం పెట్టించుకుని మూడు వందలు ఇస్తున్నారు. రోజుకి పది రూపాయలు. అంతకంటే వ్యవసాయమే బెటర్ అనిపించింది. మా నాన్నకూడా ముసలాడయ్యాడు. అందుకని" నవ్వాడు.

"మీకు రిజర్వేషన్స్ ఉంటాయిగా? గవర్నమెంట్ జాబ్ రాలేదా?"

రాఘవ దిగులుగా నవ్వాడు.

"నలభై శాతం వాడికి పోటీగా ఎనభై శాతం వాడు ఉంటాడుగా. మా అన్నలాంటివాడు. వాళ్ళ నాన్నలు చదువుకున్నవాళ్ళు. చదువు విలువ తెలిసినవాళ్ళు. వాళ్ళు ఒక ధ్యేయం పెట్టుకుని చదువుతారు. దాంతో మా కోటాలో

నాకు ఉద్యోగం రాలేదు. మా బిసి – బికి చాలా కాంపిటీషన్. మా ఆవిడకంటే లేడీస్ కోటా ఉంది. ఒకటో తరగతి పిల్లలకి పాఠాలు చెబుతూ కలెక్టర్‌లాగా ఫీల్ అవుతుంది. నన్ను వ్యవసాయం మానేయమని ఒకటే గోల" రాఘవరావు దిగులుగా నవ్వాడు.

అతని మొహంలో అంత దిగులు నేనెప్పుడూ చూడలేదు. ప్రతిదాన్ని తేలికగా తీసుకుని నవ్వుతూ కొట్టిపారేసే రాఘవరావు మొహంలో నీలినీడలు.

"అయ్యో! నీకు పెళ్ళని అమ్మ చెపితే, ఇంతకాలానికి నీకు కుండా కుదురు ఏర్పడతాయని సంతోషించాను. ఇదేంటి?" బాధగా చెప్పాను.

"ఈ కాలంలో కుండలెవరికి కావాలి?" సన్నగా నవ్వాడు.

"నలభై ఏళ్ళదాకా అప్లై చేసుకోవచ్చుగా? జాబ్ హంట్ చేస్తూనే ఉండు. లక్కీగా ఏదో గవర్నమెంట్ జాబ్ రాకపోదు." ఓదార్చాను.

"రావాలి. లేకపోతే  నీతో కాపురం చేయనని మా ఆవిడ ఇంట్లోంచి వెళ్ళిపోయింది. ఇంటా బయట అంతా నన్ను అసమర్థుడిలాగా చూస్తున్నారు" రాఘవరావు కంఠంలో విషాదం.

"అసలు నీదే తప్పు. సైన్స్ రాదని ముందే మీ అన్నయ్యకి చెప్పి ఉంటే బికాంలో చేరి, నాలా బేంక్ ఆఫీసర్ అయ్యేవాడివి" కోప్పడ్డాను.

"వాడిని తప్పు పట్టకు. చిన్నప్పటినించి అమ్మానాన్నల కష్టాలు చూసి మేమైనా బాగుపడాలని నా మీద శ్రద్ధ తీసుకున్నాడు. కానీ దేవుడు నాకా రాత రాయలేదు."

"పిల్లలా?" అడిగాను.

"నా మొహానికి అదొక్కటే తక్కువ."

"పురుగుల అన్నం తిన్నప్పుడు కూడా నువ్వు ఇంత నిరాశగా మాట్లాడలేదు. అన్ని రోజులు ఒకలాగా ఉండవు. నీకు మంచి ఉద్యోగం వస్తుందేమో ఎవరికి తెలుసు? దిగులు పడకు. బేంక్ టెస్టులు రాయి. గవర్నమెంట్ జాబే రావాలని ఏముంది?" ఓదార్చాను.

"తెలివి ఉంటే అన్నిట్లో ఉంటుంది. మొద్దుకి అన్నీ కష్టమే. మిలటరీలోకి వెళ్ళాలని కూడా చూసా. పురుగుల అన్నం తిన్న బాడీ కదా! ఫిట్‌నెస్ టెస్ట్‌లో ఫెయిలయ్యాను" నిరాశగా చెప్పాడు.

నాకేం మాట్లాడాలో తెలీలేదు.

ఆ సాయంత్రం నేను జాజిపూలు కోస్తూంటే, పసుపుపచ్చ రంగు గొడుగులో ఎవరో మా వీధిలోకి రావడం కనిపించింది. నల్లగా సన్నగా ఉన్న ఆ అమ్మాయి గాఢమైన గులాబీ రంగు చీర కట్టుకుంది. పల్చటి బ్లౌజ్‌లోంచి బ్రా పట్టీలు

తెల్లగా కనిపిస్తున్నాయి. చాలా పొడవైన బెల్ట్ ఉన్న హేండ్‌బేగ్ వేసుకుంది. తల్లో వాడిపోయిన కనకాంబరాల మాల సాగి జడకన్నా పొడుగ్గా ఉంది.

"మీ రాఘవరావు వాళ్ళావిడ" కాఫీ గ్లాస్‌తో వచ్చిన అమ్మ చెప్పింది.

"వెదర్ బానేఉందిగా. గొడుగు ఎందుకు? డబ్బింగ్ అరవ సినిమాల్లో చూసా ఇలా స్కూల్‌కి వెళ్ళడం" నవ్వాను.

"మొగుడు పొలం పనులు చేయడం ఇష్టం లేదట. యం ఎస్సీ అని చేసుకున్నాను. నువ్వు నాలాగా ఉద్యోగం చేస్తేనే నీతో కలిసుంటా అని చెప్పి ఇంట్లోంచి వచ్చేసి మన సందు చివర ఇంట్లో అద్దెకి ఉంటోంది."

"ఆ అమ్మాయి దృష్టితో ఆలోచిస్తే తన తప్పేమీ లేదులే."

"నిజమే. కాని ఊళ్ళో పరువు పోయిందని రాఘవరావు వాళ్ళమ్మగోల. మధ్యలో వాడు నలిగిపోతున్నాడు" చెప్పి అమ్మ ఖాళీ గ్లాస్‌తో లోపలికి వెళ్ళిపోయింది.

ఆ తర్వాత మూడు నెలలకి అమ్మ మా లేండ్‌లైన్‌కి ఫోన్ చేసి చెప్పింది.

"రాఘవరావు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కనే పొలాల్లో పనిచేసే వాళ్ళు 'రైలు వస్తోంది. తప్పుకో' అని అరుస్తున్నా వినిపించుకోకుండా ఎదురువెళ్ళాడట" అమ్మ కంఠంలో దుఃఖం.

"అయ్యో!" ఆక్రోశంగా అరిచాను.

"ఈ పనుల కోసమా నిన్ను ఇంత చదివించింది? ఏదైనా ఉద్యోగం సంపాదించి కోడల్ని ఇంటికి తీసుకురా ' అని ఇంట్లో పెద్దవాళ్ళ గోల ఎక్కువైందట. సాయంత్రం వాళ్ళావిడ దగ్గరకి వచ్చి ఇంటికి వెళ్దాం రమ్మంటే, 'అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో రా. లేకపోతే, నువ్వు చచ్చినా రాను' అందట. అటునించి అటే రైలు కట్టకి వెళ్ళాడట..." అమ్మ ఏదో చెప్తూనే ఉంది.

సమాజం, రాజ్యాంగం అస్తవ్యస్థంగా మలిచిన మట్టిబొమ్మ రాఘవరావు, నవ్వు మొహంతో మృత్యువుని ఆహ్వానించడం నా కళ్ళముందు మెదులుతోంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments